ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శనివారం 15 ఫిబ్రవరి 2025





కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న భాస్కర్

జిల్లా ఉత్తమ అధ్యాపకుడిగా భాస్కర్

పరిగి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ పి.భాస్కర్ జిల్లా ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్, పరిగి కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమారస్వామి, పేద్దేముల్ ప్రిన్సిపాల్ నర్సింహులు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన ఆసుపత్రి స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

భూ ఆక్రమణపై నివేదిక ఇవ్వండి

» జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి

కీసర, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): కీసరలోని పల్లె దవాఖాన కోసం కేటాయించిన భూమి ఆక్రమణపై సంబంధిత అధికారులు నివేదిక ఇవ్వాలని మేడ్చల్ జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని పలు బస్తీ, పల్లె దవాఖానలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీసరగుట్టకు వెళ్లే ప్రధాన రహదారిపై పల్లె దవాఖాన కోసం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. దీనిపై సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు, వైద్యాధికారులు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. మందుల కొరతపై అధికారులతో చర్చించారు. ఆస్పత్రులకు వచ్చిన రోగులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వేలల్లో బిల్లులు.. చీటీపైనే లెక్కలు
అనుమతులు లేని డయాగ్నోస్టిక్ సెంటర్లు
మెడికల్ షాపుల్లో డ్రగ్ మాఫియా
రోగులను పీడిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు

ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే నిలువు దోపిడీ చేస్తున్నారు. బాగుపడి ఇంటికొస్తామన్న ఆశలేకపోగా అప్పుల పాలవుతున్నారు. పేదోడే లక్ష్యంగా అందినకాడికి దండుకుంటున్నారు. రోగ నిర్ధారణ పరీక్షల పేరుతో ఒక్క పూటలోనే రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు బిల్లు వసూలు చేస్తున్నారు. ఇదంతా హైదరాబాద్ మహా నగరంలో అనుకుంటే పొరపాటే.. వికారాబాద్ జిల్లాలోనూ ఇదే దుస్థితి. తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానాలకు వెళ్తే అడిగినకాడికి వారికి ముట్టజెప్పాల్సిందే. జిల్లాలోని ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్ల దోపిడీపై కథనం.

దగాఖానాలు

నిర్ధారణ పరీక్షల పేరుతో దోపిడీ



వికారాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. చిన్న జ్వరం వచ్చినా ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని ఆస్పత్రుల్లో వ్యాపారం చేస్తున్నారు. పట్టణంలో తాజాగా ప్రారంభమైన కొత్త ఆసుపత్రితోపాటు, స్థానికంగా రెండు, మూడు పెద్ద ఆస్పత్రుల్లో ఖచ్చితంగా నిర్ధారణ పరీక్షలు చేస్తేనే రోగిని చూస్తున్నారు. రోగికి డాక్టర్ ఫీజుతో పాటు రక్తపరీక్షలు, ఇతర పరీక్షలు అన్ని కలుపుకొని ఒక్క రోజులోనే రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది.

ఇక్కడ పరీక్షలు చేసుకుంటేనే..

తమ వద్ద పరీక్షలు చేసుకుంటేనే వైద్యం చేస్తామంటూ పెద్ద ఆసుపత్రులు తేల్చి చెబుతున్నాయి. వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత పరీక్షలు చేయించుకొని వస్తామంటే ఆస్పత్రి వర్గాలు వినిపించుకోవడం లేదు. మా వద్ద చేసుకుంటే చికిత్స చేస్తామని చెబుతుండడం విడ్డూరం. పట్టణంలోని పలు ప్రైవేటు, చిన్న చిన్న క్లీనిక్‌లు ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్లతో

మిగతా 8వ పేజీలో...



చర్యలు తీసుకుంటాం

జిల్లాలో అనుమతులు లేకుండా సాగుతున్న డయాగ్నోస్టిక్ సెంటర్లను సీజ్ చేస్తాం. అనుమతులు ఉన్న సెంటర్లలో తప్పనిసరిగా ధరల పట్టిక పెట్టాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఉచితంగా రక్త పరీక్షలు చేస్తారు. అక్కడి నుంచి రక్త పరీక్షలు తీసుకొస్తే ఏ ఆస్పత్రి అయినా చికిత్స అందించాలి. అలా చేయకపోతే చర్యలు తీసుకుంటాం.

- వెంకటరవణ, డీఎంహెచ్‌వో

జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు రాణి



మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 18 వరకు హర్యాణలోని ఆర్యా కనయా గురుకుల్, కర్నల్‌లో జరగనున్న 71వ సీనియర్ జాతీయస్థాయి మహిళా కబడ్డీ ఛాంపియన్‌షిప్ - 2025 పోటీలకు మూడుచింతలపల్లికి చెందిన బొంగోని రాణి ఎంపికయ్యారు. తెలంగాణ కబడ్డీ జట్టు నుంచి పోటీల్లో పాల్గొంటుంది. మండల కేంద్రంలో ఉంటూ స్థానిక ఎస్ఎస్ఆర్ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న రాణి కబడ్డీపై ఉన్న ప్రేమతో కష్టపడి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల డైరెక్టర్ కళ్లెం శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ రాధిక, తోటి ఉపాధ్యాయులు, స్నేహితులు, తోటి క్రీడాకారులు అభినందించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ నారాయణ శర్మ, అధికారులు

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తాం

కీసర, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించే కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామని కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ అన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి మార్చి 1 వరకు జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేసే స్టాల్స్‌ను, దుకాణ సముదాయాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రణాళిక రూపొందించాలని పోలీస్ అధికారులను కోరారు. అందరి సహకారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈవో సుధాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఏఈ జగపతిబాబు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవ అభినందనీయం

» వార్డెన్లు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి » స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



హాస్టల్ వార్డెన్లకు వంట సామగ్రి పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చొరవ తీసుకొని నిధులు సమీకరించి ప్రభుత్వ వసతి గృహాలకు వంట సామగ్రి అందించడం అభినందనీయమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని 104 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రభుత్వ, గురుకుల వసతి గృహాలకు రూ.25 లక్షల విలువైన వంట సామగ్రిని ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్లలో వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. వార్డెన్లు విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకోవాలని సూచించారు. ఈ సామగ్రితో వసతి గృహాల్లో వంటలు మరింత సులభంగా, శుభ్రంగా ఉంటాయన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ బడ్జెట్‌లో 7 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందుతుందని పేర్కొన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న భోజనం, సౌకర్యాలపై ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు తనిఖీ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి దేశంలోనే మొదటిసారి విద్యా కమిషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, డీఈవో రేణుకాదేవి, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ లేన్‌రోడ్డుకు శంకుస్థాపన

కోట్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం డబుల్ లేన్ రోడ్డు నిర్మిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోత్కుపల్లిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సీఆర్ఐ ఎఫ్ నిధులతో మోత్కుపల్లి నుంచి వికారాబాద్ అనంతగిరిపల్లి వరకు రూ.30 కోట్ల నిధులతో 15 కిలోమీటర్ల రెండు వరుసల రోడ్డుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఏస్ రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేపీ వికారాబాద్ జిల్లా కోఆర్డినేటర్, దిశ కమిటీ మెంబర్ వడ్ల నందు, పాల్గొన్నారు. అక్కడి నుంచి స్పీకర్ బార్వాద్ గ్రామంలో కొత్తపల్లి జగన్నాథ్ రెడ్డి నివాసంలో నిర్వహించిన శివ స్వాముల పడిపూజకు హాజరయ్యారు.



పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు పెంపు

» ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వ నిర్ణయం
» ఉమ్మడి జిల్లాలో 67 సహకార సంఘాలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 67 సహకార సంఘాల కాలపరిమితి, డీసీసీబీ చైర్మన్ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలక వర్గ పదవీకాలానికి ఆరు నెలల ముందే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 15 నాటికే గడువు ముగుస్తున్నా ఇంత వరకు రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. ఈనేపథ్యంలో పాలవర్గ గడువును పొడిగించింది. రంగారెడ్డి జిల్లాలో 38 పీఏసీఎస్‌లు ఉండగా 2020లో 37 పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిగాయి. ప్రతి పీఏసీఎస్‌లో 13 మంది చొప్పున 37 సంఘాల్లో 481 మంది డైరెక్టర్లు మరో ఆరు నెలలపాటు కొనసాగనున్నారు. అలాగే, వికారాబాద్ జిల్లాలో 21 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఒకరైతు సహకార సంఘం, మేడ్చల్ జిల్లాలో 9 పీఏసీఎస్‌ల్లో మరో ఆరు నెలలు పాలన కొనసాగనుంది.

పోలెపల్లి జాతరకు సీఎం రేవంత్‌రెడ్డి

» ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మినీ మేడారాన్ని తలపించే కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం పోలెపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. జాతర ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం సిడె కార్యక్రమానికి ఈ నెల 21న సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పోలెపల్లిలో పర్యటించారు. ఆలయంలో ఎల్లమ్మను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ అధికారులు షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు అదనంగా బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాములు, డీపీఓఆర్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏఎంసీ అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రి తుమ్మలను కలిసిన చైర్మన్ పరశురాంరెడ్డి

పరిగి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని, కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి తుమ్మలతో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి

పొగపెట్టారు

ఔటర్ టోల్ ప్లాజా వద్ద, మూసీ ఒడ్డున చెత్తకు నిప్పు

కిలోమీటర్ల మేర కనిపించని రోడ్డు.. పొగతో నిత్యం వాహనదారులకు ఇక్కట్లు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని ఔటర్‌కు ఆనుకొని నిత్యం టన్నుల కొద్దీ చెత్తను నిబంధనలకు విరుద్ధంగా తగులబెడుతుండటంతో వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని మూసీ నది ఒడ్డున, ఘట్‌కేసర్ ఔటర్ టోల్‌ప్లాజా వద్ద నిత్యం టన్నులకొద్ది చెత్తను తగులబెడుతున్నారు. దీంతో పెద్దఎత్తున నల్లటి పొగ

మిగతా 8వ పేజీలో...



చర్యలు తీసుకుంటాం

మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నుంచి వెలువడే చెత్తను ఔటర్ టోల్‌ప్లాజా వద్ద నిల్వచేసి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. ఆలస్యమైతే గుర్తుతెలియని వ్యక్తులు తగులబెడుతున్నారు. మూసీనది పక్కన చెత్తను కాల్చకుండా చర్యలు తీసుకుంటాం.

- వీరారెడ్డి, కమిషనర్, పోచారం మున్సిపాలిటీ



మూసీనది పక్కన సర్వీసు రోడ్డు వద్ద కాలుతున్న చెత్త



ప్రమాదం పొంచి ఉంది

ఉద్యోగ నిమిత్తం నిత్యం పెద్దంబర్‌పేట్ నుంచి ఘట్‌కేసర్ మధ్య ఔటర్‌పై ప్రయాణం చేస్తా. అటు మూసీ వద్ద, ఇటు ఘట్‌కేసర్ టోల్‌ప్లాజా వద్ద చెత్తను కాలుస్తున్నారు. దీంతో వచ్చే పొగతో రోడ్డు కనిపించడంలేదు. రాత్రి సమయాల్లో పొగ ఇంకా ఎక్కువవుతున్నది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

- కొమ్మిడి మురళీధర్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, కర్మన్‌ఘాట్

కొర్రెముల.. పొగతో విలవిల

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 14: పోచారం మున్సిపాలిటీ కొర్రెముల ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన మూసీనది ఒడ్డున రోజుకు పదుల సంఖ్యలో చెత్తను ట్రాక్టర్లల్లో డంపింగ్ చేసి కాలుస్తున్నారు. నిత్యం వాయుకాలుష్యంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే లేరు. పోచారం మున్సిపాలిటీలోని పలు గ్రామాల నుంచి తరలించిన చెత్తను మూసీవద్ద కాల్చడంతో పరిసరాల్లో ఉన్న వ్యవసాయదారులు, గీత కార్మికులు, పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాయు కాలుష్యంతో శ్వాసకోస సంబంధిత, చర్మ వ్యాధులతో సతమతమవుతున్నారు. పాడిరైతులు, వ్యవసాయదారులు అటువైపు వెళ్లాలంటే జంకుతున్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో వస్తున్న పొగతో ఔటర్ రింగ్‌రోడ్డు, సర్వీసు రోడ్డులో వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొర్రెముల మూసీనది వద్ద చెత్తను డంప్ చేయొద్దని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



చెత్తను డంప్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి

షాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీంభరత్ అన్నారు. షాబాద్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్న గ్యారెంటీల అమలు, ప్రజాక్షేమానికి చేస్తున్న ప్రతీ పథకాన్నీ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. మహిళలకు ఉచిత రవాణ, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రేషన్ కార్డులిచ్చాయని, మళ్లీ పదేండ్ల తరువాతే ఇప్పుడు రేషన్ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళా కార్యకర్త గ్రామ స్థాయి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

ఫైలేరియా నిర్ధారణకు రక్త నమూనాల సేకరణ

దౌల్తాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలంలోని నందారం గ్రామంలో శుక్రవారం రాత్రి ఫైలేరియా వ్యాధి నిర్ధారణకు ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఫైలేరియా వ్యాధి నివారణలో భాగంగా వైద్యాధికారి అమూల్య ఆధ్వర్యంలో గ్రామంలో కొడంగల్ సబ్‌యూనిట్ అధికారి పకీరప్ప గ్రామస్తుల నుంచి బ్లడ్ శాంపిల్ సేకరించారు. వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామంలో 101 మంది రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ల్యాబ్‌టెక్నీషియన్ శ్రీధర్‌రెడ్డి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు మంగమ్మ, శశికళ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య



నియామక పత్రం అందుకుంటున్న వెంకటయ్య

తలకొండపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లికి చెందిన జోలం వెంకటయ్యయాదవ్, కార్యదర్శిగా వీరన్నపల్లికి చెందిన లింగంగౌడ్ నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రాలు అందజేశారు. బీసీల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు చేస్తున్న కృషి చేస్తున్నారని కొనియాడారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెంకటయ్య, లింగంగౌడ్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి చెర్కు మణికంఠ, రాజు, రాజేందర్, సురేశ్‌యాదవ్, భాస్కర్ ఉన్నారు.

అనాథాశ్రమానికి సీఐ చేయూత

యాచారం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అనాథ ఆశ్రమానికి యాచారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.నర్సింహారావు శుక్రవారం రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఆగాపల్లిలో చాలా కాలంగా ఓ అనాథ ఆశ్రమం ఉంది. పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అధికారులు వీరికి తరచూ సాయమందిస్తూ ఆదుకుంటున్నారని సీఐ తెలుసుకున్నారు. ఆయన తన వంత సాయం ఆశ్రమ నిర్వాహకులను స్టేషన్‌కు రప్పించి రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు.



బియ్యం అందజేస్తున్న సీఐ


ఉత్సవాల్లో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఘనంగా సంగమేశ్వరస్వామి జాతర

మొయినాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కనకమామిడి సంగమేశ్వరస్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మహా మంగళహారతి, శివ తీర్థం నిర్వహించారు. స్వామివారికి అభిషేకాది పూజలు చేశారు. చివరి రోజు సమీప గ్రామస్థులు, హైదరాబాద్ నుంచి భక్తులు తరలివచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎ.మధుసూదన్‌రెడ్డి ఉత్సవాల్లోని పాల్గొన్నారు. ఆయనతో మాజీ సర్పంచ్ పి.జనార్ధన్‌రెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

జడ్జిపై దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులో బుధవారం మహిళా జడ్జిపైకి నిందితుడు చెప్పు విసిరిన సంఘటనను నిరసిస్తూ శుక్రవారం కొడంగల్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించారు. బార్ అధ్యక్షుడు బి.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి భాగ్యలత మాట్లాడుతూ.. ఇది న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగ చట్టాలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. నిందుతుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు పి.వెంకట్‌రెడ్డి, ఎవీ.ఆనంద్, పి.సుధాకర్‌రెడ్డి, టి.కరుణాకర్‌రెడ్డి, యు.బస్వరాజ్, మురళీ మోహన్ నామాజీ, వెంకటయ్య, కె.రాములు, బి.కృష్ణయ్య, కె.రమేష్, పి.భానుప్రసాద్, రవీందర్, మొహిద్ పాల్గొన్నారు.

యువత సంస్కృతిని మరువొద్దు



షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ పేరుతో యువతీ, యువకులు భారత సంస్కృతి, సంప్రదాయాలను మరవొద్దని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యెంకన్నోళ్ల వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రేమికుల రోజు పేరిట మనదికాని పాశ్చాత్య కల్చర్‌ను ప్రవేశపెట్టి, భారతీయ సంస్కృతిని విచ్ఛిన్నం చేయాలనే కుట్ర చేస్తున్నారని అన్నారు. పట్టుదలతో చదివి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు శ్రమించాల్సిన విద్యార్థులు ప్రేమ పేరుతో జీవితాలను పాడుచేసుకోవద్దని కోరారు. బాధ్యత కల్గిన ప్రతీ పౌరుడు ప్రేమికుల దినోత్సవాన్ని కాకుండా ఫిబ్రవరి 14వ తేదీని దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు అంకితమిచ్చి, వారి ఆత్మకు శాంతి చేకూరేలా సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని వెంకటేష్ కోరారు.

గ్రామీణాభివృద్ధి సంస్థను ప్రైవేట్‌పరం చేయొద్దు

కేశంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థను ప్రైవేట్‌పరం చేయొద్దని బొదునంపల్లి గ్రామస్థులు శుక్రవారం రాష్ట్రపతి ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీలకు పోస్టుకార్డులను పంపారు. గ్రామ కూడలిలో ర్యాలీ నిర్వహించి, పోస్టు కార్డులను ప్రదర్శించారు. గొప్పపేరున్న జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థను ప్రైవేట్‌పరం చేస్తే అందులోని ఉద్యోగుల రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లింగారెడ్డి, అంజనేయులుగౌడ్, పిప్పల మల్లయ్య, కోటయ్య, రాములు, లక్ష్మయ్య, యాదయ్య, నరసింహ, బాలరాజు, చెన్నయ్య, మల్లయ్య, తిరుపతి, రాములు, శంకరయ్య, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. చేవెళ్లలో భూపోరాట కేంద్రంలో రెండో వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా భూపోరాట కేంద్రంలో తాగునీరు, విద్యుత్, వంటి సౌకర్యాలు లేకున్నా ఇండ్ల పట్టాల కోసం భూపోరాటం చేస్తున్న పేదలను అభినందించారు. ప్రభుత్వం స్పందించి వారికి ఇళ్లు కట్టివ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, సభ్యుడు సుధాకర్‌గౌడ్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మొయినాబాద్, షాబాద్ కార్యదర్శులు శ్రీనివాస్, జంగయ్య, మక్బుల్, మంజుల, శివబాబురావు, లలితమ్మ, సుగుణమ్మ, రమాదేవి, పెంటయ్య, శ్రీకాంత్, యాదగిరి ఉన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ నాయకులు



కడ్తాల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ సభ్యుడు ఐళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో వివిధ మండలాల నాయకులు మంత్రిని శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులిచ్చి సహకరించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, బిచ్యానాయక్ ఉన్నారు.

ఘనంగా గద్యత్రయ పారాయణం

- వైభంగా కొనసాగుతున్న సమతా కుంభ్ బ్రహ్మోత్సవాలు
- హాజరైన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


పూజలు నిర్వహిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఆధ్యాత్మిక గురువు చిన జీయర్‌స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న సమతా కుంబ్ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గద్యత్రయ పారాయణం చేపట్టారు. ఉత్సవాల్లో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన జీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. స్వామిజీ ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, మంగళశాసనములు అందజేశారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్‌స్వామి, మైహోంగ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్ రావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండెల ఎల్లమ్మ జాతర



కొడంగల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే బండెల ఎల్లమ్మ జాతర శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులు జరిగే జాతరకు కొడంగల్, పరిసర గ్రామాల ప్రజలు తరలివస్తారు. మొదటి రోజు ప్రధాన ఘట్టం సిడె కనులపండగగా నిర్వహించారు. శుక్రవారం కొడంగల్‌లోని వివిధ కాలనీ మహిళలు బోనాలతో ర్యాలీగా బయలుదేరి నైవేద్యం సమర్పించారు. కొడంగల్ ఏఎంసీ మాజీ వైస్‌చైర్ పర్సన్ వాణిశ్రీయాదవ్, రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో వెళ్లి ఆలయంలో పూజలు నిర్వహించారు.

ప్రజల నిర్లక్ష్యం..

పశువుల పాలిట శాపం

రోడ్ల పక్కన చెత్త పారబోత

- ప్లాస్టిక్ కవర్లు తింటూ అనారోగ్యం బారిన..
- ఆవులు, దూడల మృత్యువాత
- చర్యలు తీసుకోని మున్సిపల్ అధికారులు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన పారబోస్తున్న చెత్త, ప్లాస్టిక్ కవర్లు మూగజీవాల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. స్థానిక రైతులకు చెందిన ఆవులు, ఎద్లు, గొర్లు, మేకలు, ఇతర సాధు జంతువులు పదుల సంఖ్యలో పట్టణంలో సంచరిస్తుంటాయి. మేత లేక చెత్త, ప్లాస్టిక్ కవర్లు తింటున్నాయి. తిన్న ప్లాస్టిక్ కవర్లు కడుపులో పేరుకుపోయ కొన్ని రోజులకే పశువులు మృత్యువాత పడుతున్నాయి.


రోడ్లపై సంచరిస్తున్న ఆవులు, దూడలు


పారేసిన ప్లాస్టిక్ కవర్లను తింటున్న పశువులు

ఎక్కడికక్కడ చెత్త వేయడం వల్లే..

పట్టణంలోని అన్ని వార్డులకు రెండు రోజులకోసారి చెత్తసేకరణ వాహనం వస్తోంది. చెత్తసేకరణ చేసే కార్మికులకు నెలకు రూ.70 నుంచి రూ.199 ఇవ్వాల్సి ఉంటుంది. వారికి డబ్బులివ్వాల్సి వస్తుందని చాలా మంది రాత్రిపూట చెత్తనంతా రోడ్లపక్కన పారబోస్తున్నారు. తెల్లవారి మున్సిపల్ సిబ్బంది దానిని తీసుకెళ్తున్నారు. అయితే అంతలోనే పశువులు ప్లాస్టిక్ కవర్లు తినేస్తున్నాయి. పశువులను రోడ్లపైకి వదిలితే గోశాలలకు తరలిస్తామని గతంలో మున్సిపల్ అధికారులు పశుపోషకులకు, రైతులకు చాటింపు వేయించారు. అయినా ఇది అమలుకు నోచుకోలేదు. పశుపోషకులు కూడా వాటిని కట్టేయకుండా రోడ్లపై విడిచి పెడుతున్నారు. పశువులు రాత్రింబవళ్లు రోడ్లపై సంచరిస్తూ అక్కడే పడుకుంటున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయమూ కలుగుతోంది. ప్రమాదాలూ జరుగుతున్నాయి. కొన్ని రోజుల క్రితం చౌరస్తాలో ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడు బైక్‌తో ఓ పశువును ఢీకొట్టి చనిపోయాడు. పట్టణంలో పశువులు తిరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. అయినా ఆచరణకు నోచుకోలేదు. రాత్రి పూట దుకాణాల వద్ద పడుకొని అక్కడే పేడ వేస్తున్నాయి. రోడ్డు పక్కన నాటిన మొక్కలను మేస్తున్నాయి.

చాలా సార్లు ఫిర్యాదు చేశాం



పశువులు ప్లాస్టిక్ కవర్లు తిని అనారోగ్యం బారిన పడుతున్నాయి. రోడ్లపై తిరిగే ఆవులు, దూడలను గోశాలలకు తరలించాలని మున్సిపల్ అధికారులకు మేం ఫిర్యాదు చేశాం. వారేమీ పట్టించుకోవడం లేదు. చూడలేక ఓసారి మేమే గోశాలకు తరలించాం. పశువుల యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసి వాటిని తీసుకువెళ్లాడు. మళ్లా రోడ్లపైకే వదుల్తున్నారు. దీనిపై అధికారులే చర్యలు తీసుకోవాలి.

- చెట్ల వెంకటేష్, హిందూ వాహిని నాయకుడు



గట్టుపల్లిలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ శిక్షణ తరగతులు?

మహేశ్వరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకుల శిక్షణ తరగతులు మహేశ్వరం మండలం గట్టుపల్లిలో గల కేసీఆర్ రిసార్ట్స్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించేందుకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. యువజన కాంగ్రెస్ శిక్షణ తరగతులకు ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతారని తెలుస్తోంది. నూతనంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేతల నియామకాలు జరిగిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించుకునేలా యువ నాయకులు శిక్షణిస్తారని సమాచారం. మూడు రోజుల ఈ శిక్షణా తరగతులకు సీఎం రేవంత్‌రెడ్డి, కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతారని తెలుస్తున్నా దానిపై వివరించేందుకు కాంగ్రెస్ నాయకులు సుముఖంగా లేరు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 250 మంది వరకు యువజన కాంగ్రెస్ నాయకులు హాజరవుతారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే శిక్షణ తరగతులకు స్థానిక కాంగ్రెస్ నాయకులకు, ముఖ్య కార్యకర్తలకు, మీడియా ప్రతినిధులకు కూడా అనుమతి లేదని తెలుస్తోంది.

పన్ను వసూళ్ల లక్ష్యం చేరకుంటే వేటు

- సీడీఎంఏ అధికారుల వార్నింగ్
- రశీదులు లేకుండా పన్ను వసూళ్లు నిజమే : కమిషనర్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లలో మున్సిపల్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, లక్ష్యం మేరకు ట్యాక్స్‌లు వసూలు చేయకుంటే బాధ్యులపై వేటు తప్పదని కమిషనర్‌కు రాష్ట్ర స్థాయి మున్సిపల్ పరిపాలన డైరెక్టరేట్(సీడీఎంఏ) అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పనిచేయని సిబ్బందిపై చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వంద శాతం పన్ను వసూలు చేయకుంటే సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. దీంతో శుక్రవారం మున్సిపల్ కిందిస్థాయి సిబ్బంది నుంచి కమిషనర్ వరకు పన్నుల వసూళ్లకు రంగంలోకి దిగారు. 'పన్నుల వసూళ్లలో తాండూరు లాస్ట్' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సీడీఎంఏ ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్ స్పందించారు. మున్సిపాలిటీలో బడ్జెట్ లేక సాధారణ పనులు, మైనర్ పనులు కూడా చేయడం లేదు. గతంలో ఓ మున్సిపల్ జవాన్ తానే అధికారిలా వ్యవహరించి ట్రేడ్ లైసెన్స్ పేరిట డబ్బులు వసూలు చేసి మున్సిపాలిటీ ట్రెజరీకి జమచేయలేదు. ఈ విషయాన్ని సైతం ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీంతో కమిషనర్ విక్రంసింహారెడ్డి స్పందించారు. విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మున్సిపల్ రశీదు లేకుండా పట్టణ ప్రజలైనా, వ్యాపారులైనా డబ్బులు చెల్లించొద్దని, పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించినా లేదా నగదు ఇచ్చినా రశీదు తప్పక పొందాలని సూచించారు. ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీ కేటాయించి ఉద్యోగికి మాత్రమే డబ్బు కట్టి రషీదు పొందాలన్నారు. కొందరు సిబ్బంది మున్సిపల్ ట్యాక్సులు వసూలు చేసి సొంతానికి వాడుకున్నట్టు తెలిసిందని కమిషనర్ చెప్పారు. అలాంటి వారు మున్సిపల్ ట్రెజరీకి వెంటనే డబ్బులు జమచేయాలని ఆదేశించారు. బకాయిల వసూళ్లకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు.

మంత్రి ద్వారా సీడీఎంఏకు ఫోన్?

పన్ను వసూళ్లలో వెనకబడ్డారని తాండూరు మున్సిపల్ అధికారులను ఇప్పటికే సీడీఎంఏ అధికారులు పలుమార్లు టెలీ కాన్ఫరెన్స్‌లో హెచ్చరించారు. ఇప్పుడు చర్యలకు ఉపక్రమించారు. తనపై వేటు పడుతుందేమోనని తాండూరు మున్సిపల్ అధికారి ఒకరు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ మంత్రి ద్వారా సీడీఎంఏ కార్యాలయానికి ఫోన్ చేయించుకున్నట్టు తెలుస్తోంది. పన్ను వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేస్తామని, తనకు ఒక అవకాశం ఇవ్వాలని సదరు అధికారి రాష్ట్ర అధికారులను వేడుకోగా వారు చివరి అవకాశం ఇచ్చినట్టు తెలుస్తోంది. మార్చి నాటికి లక్ష్యం మేరకు పన్ను వసూలు చేయకుంటే వేటుతప్పదని ఉన్నతాధికారులు తేల్చి చెప్పినట్టు సమాచారం.

26.79కిలోల గంజాయి స్వాధీనం

వికారాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి గంజాయిని రవాణా చేస్తున్నాడనే సమాచారంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు దాడులు చేశారు. నిందితుడి నుంచి 26.79కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వికారాబాద్‌లో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఓ వ్యక్తి గంజాయి రవాణా చేస్తున్నాడని సమాచారమొచ్చింది. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, వికారాబాద్ ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారు టలు దాడులు నిర్వహించారు. వికారాబాద్ రైల్వేస్టేషన్ రెస్ట్‌హౌస్ వద్ద పశ్చిమ బెంగాల్‌కు చెందిన సన్నీసేథ్ నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎస్‌ఐ ప్రేమ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, శివ, రాంగణేష్, మహేందర్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరిస్మారక కేంద్రంలో జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేయాలన్నారు. బలవంతపు భూసేకరణ చేయొద్దంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామోజీఫిలిం సిటీ వద్ద గతంలో ఇచ్చిన పట్టాల మేరకు పేదలకు స్థలాలు కేటాయించాలన్నారు. కప్పాడులో బినామీ భూములను పేదలకు పంచాలన్నారు. ఎస్సీ వర్గీకరణను సీపీఎం స్వాగతిస్తోందని, దీనికోసం చట్టం తీసుకురావాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను అమలుచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ మేరకు సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, భాస్కర్, సామేల్, బుగ్గ రాములు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో 3వేల మందికి ఉద్యోగాలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన కల్వకుర్తి నియోజకవర్గంలోని చౌదర్‌పల్లి, గొల్లోనిపల్లి గ్రామాల యువతకు శుక్రవారం టాస్క్ కార్యాలయంలో రాఘవేందర్‌రెడ్డి నియామక పత్రాలందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో టాస్క్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 3వేల మంది మహిళలకు ఉపాధి, యువతకు ఉద్యోగాలు కల్పించేలా జాబ్‌మేళా నిర్వహిస్తామని రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, చంద్రశేఖర్, కొండల్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి

- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శీతల్


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శీతల్

పరిగి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, జిల్లా జడ్జి డీబీ శీతల్ అన్నారు. పరిగిలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ స్కూల్‌లో శుక్రవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. విద్యతోపాటు చట్టాల గురించి తెలుసుకోవాలని, విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. చదువుకున్న వారి జీవన విధానం ఇతరులకు భిన్నంగా ఉంటుందన్నారు. ప్రాథమిక దశలో క్రమశిక్షణ లేకపోతే చెడుదారిని పట్టే అవకాశం ఉందన్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బదులు ఎదురైనా, వేధింపులకు గురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీసులు స్పందించకపోతే నేరుగా తనను కలిసి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని తెలిపారు. బాల్యవివాహాలు, బాలకార్మిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. 18ఏళ్ల లోపు బాలికలకు పెళ్లి చేయొద్దని, అది నేరం అని, ఎక్కడైనా జరిగితే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాము, శ్రీనివాస్, పరిగి లీగల్ ఎయిడ్ న్యాయవాది ఎండీ గౌస్‌పాషా, ప్రిన్సిపాల్ హరిత, ఉపాధ్యాయులు సౌజన్య, జ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.


సంగీత కచేరిని తిలకిస్తున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్

విద్యార్థులు సంగీతంలో ప్రావీణ్యం సాధించాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు సంగీత ప్రావీణ్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఎదులాబాద్‌లోని సాంఘిక సంక్షేమ ఫైన్ ఆర్ట్స్ గురుకుల పాఠశాలలో శుక్రవారం రాత్రి స్పిక్ మెక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ణాటక సంగీత కచేరికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో లలిత కళలు, సంగీతంపై ఆసక్తి పెంచుకుంటూ రాణించాలని సూచించారు. భారతీయ కళలు కనుమరుగు కాకుండా నేటి తరం పాటుపడాలన్నారు. కర్ణాటక సంగీత విద్వాంసురాలు గీత రాజా ఆధ్వర్యంలో కచేరిని ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సక్రు, ఓఎస్డీ పీఎస్నార్.శర్మ, రాష్ట్రస్థాయి అధికారి భీమయ్య, ప్రిన్సిపాల్ రాము, వైస్‌ప్రిన్సిపాల్ రాములు, స్పిక్ మేక్ వలంటీర్ వీణారెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోగస్ చెక్కులిచ్చి భూములు కాజేశారు!

- అధికారులకు రైతుల మొర


తహసీల్దార్ కార్యాలయం వద్ద చెక్కులు చూపుతున్న రైతులు

కులకచర్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):భూమి తాకట్టు(మార్ట్‌గేజ్) పెట్టుకొని డబ్బిస్తామని చెప్పి ఏకంగా సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకొని, రైతులకు డబ్బులివ్వకుండా మొత్తం భూమినే కాజేసిన వైనం కులకచర్ల మండలంలో వెలుగు చూసింది. అప్పు కోసం ఆశ్రయిస్తే భూమి లాగేసుకున్నారని రైతులు తహసీల్దార్‌కు, పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అంతారంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అంతారానికి చెందిన రైతులు లింగంగారి వెంకటేశ్, కావలి పాండు, కృష్ణయ్య, లక్ష్మయ్య, రాములు, శ్రీనివాస్‌లకు ఐదెకరాల 32గుంటల భూమి ఉంది. భూమి తాకట్టుపెట్టి డబ్బులిప్పించాలని మాజీ సర్పంచ్ కృష్ణను ఆశ్రయించారు. తనకు తెలిసిన ఫైనాన్సర్లు ఉన్నారని, భూమి తాకట్టు పడితే నూటికి రెండు రూపాయల చొప్పున వడ్డీతో రూ.40లక్షల అప్పు ఇస్తారని మాజీ సర్పంచ్ తెలిపాడు. దీనికి రైతులు అంగీకరించారు. గత నవంబరు 28న తహసీల్దార్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన దేవిరెడ్డి రత్నమ్మకు భూమి రిజిస్ట్రేషన్ చేశారు. అయితే అది తాకట్టేనని రైతులు అనుకున్నారు. రైతులకు మాయమాటలు చెప్పి సేల్‌డీడ్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అదే రోజు డబ్బులిస్తామని మాజీ సర్పంచ్ కృష్ణ తెలిపాడు. కానీ రైతులకు డబ్బు ఇవ్వలేదు. డబ్బులు తేలేదని మూడు చెక్కులు(రూ.25లక్షలు, రూ.10లక్షలు, రూ.5లక్షలు) ఇచ్చారు. చెక్కులను షాద్‌నగర్ ఐసీఐసీఐ బ్యాంక్ పేరిట ఇచ్చారు. రైతులు రెండు రోజుల అనంతరం బ్యాంక్‌కు వెళ్లి డబ్బులిమ్మనగా ఆ ఖాతాలో డబ్బులు లేవని బ్యాంకర్లు చెప్పారు. అలాగే భూమిని మార్ట్‌గేజ్ కాకుండా సెల్‌డీడ్ చేసుకున్నట్టు రైతులు గ్రహించారు. ఈ మోసంపై మాజీ సర్పంచ్‌ని రైతులు నిలదీశారు. కృష్ణ తనకు తెలియదని చెప్పాడు. రైతుల కోరిక మేరకు మధ్యవర్తులపై కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు రెండు రోజుల క్రితం ఎస్సై అన్వేష్‌రెడ్డి, తహసీల్దార్ మురళీధర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కార్యాలయానికి వచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు. వారికిచ్చిన చెక్కులను విలేకరులకు చూపారు. మాజీ సర్పంచ్ కృష్ణ, షాద్‌నగర్‌కు చెందిన మనోజ్, గణేశ్, సత్యం, మురళి, రాంనాయక్, నిఖిల్‌రెడ్డిలపై తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయంపై ఎస్సై, తహసీల్దార్‌లు వివరణిస్తూ.. తమకు రైతులు ఫిర్యాదు చేశారని, విచారణ చేస్తామని తెలిపారు.

విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం


దేవేందర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మెతుకు ఆనంద్

వికారాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గురుకుల విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం ఆడుకుంటుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. కుల్కచర్ల గిరిజన బాలుర వసతి గృహంలో నేనవత్ దేవేందర్ మృతిచెందగా .. బాధిత కుటుంబాన్ని మున్సిపల్ పరిధిలోని టేకులబీడు తండాకు చెందిన చందునాయక్‌తో కలిసి ఆయన శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి అనుమానాస్పద మృతి కలిచి వేసిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఒక పేదవిద్యార్థి ప్రాణం బలైందన్నారు. ప్రస్తుత విద్యావ్యవస్థలో పర్యవేక్షణ లోపించిందని, చదువుకునే పిల్లలకు కూడా రక్షణ కల్పించకపోతే ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్టా? లేనట్టా? అని ప్రశ్నించారు. కొన్ని వసతి గృహాల్లో విద్యార్థులు పాము, తేలు కాట్లకు గురవుతున్నారన్నారని విమర్శించారు. తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగి 15 మంది ఆస్పత్రి పాలైన ఘటన ఒక తార్కాణం అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గోపాల్, నాయకులు నర్సింహులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు మల్లయ్య, మానేయ్య, రవీ, కిష్టయ్య, రాములు చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధ వహిస్తే ఇంగ్లిష్ సులభమే..


సరోజినీ నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పరిగి,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ భాష పట్ల శ్రద్ధ కనబరిస్తే అన్నింటి కంటే కూడా ఇదే సులభమని జ్యోతిబాఫూలే పాఠశాల ప్రిన్సిపాల్ హరిత, ఇంగ్లిష్ అధ్యాపకులు జి.సౌజన్య అన్నారు. సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక జ్యోతిబాఫూలే పాఠశాలలో ఆంగ్ల దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఆంగ్లభాష అభివృద్ధి కోసం నాయుడు చేసిన కృషి అనిర్వచనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా ఈ భాష పట్ల పట్టు సాధించి సమాజంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏటీపీ, ఉపాధ్యాయులు సౌజన్య, రేణుక, అనూష తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు కిట్స్ అందజేత

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ నైబర్‌వుడ్ సెంటర్‌కు చెందిన 19 మంది మానసిక దివ్యాంగులకు శుక్రవారం కిట్స్ పంపిణీ చేశారు. వారి తల్లిదండ్రులు కిట్స్‌తో పిల్లలతో సాధన చేయించాలని, దీంతో వారిలో చైతన్యం కలుగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు జ్యోతి, భార్గవి, రజిని, నైబర్‌వుడ్ సెంటర్ సిబ్బంది శంకర్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మైదానం చదును

బషీరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లో క్రీడల కోసం ఎక్స్‌కవేటర్(జేసీబీ)తో శుక్రవారం మైదానాన్ని చదును చేశారు. స్థానికుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే తనయుడు ఎం.రోహిత్‌లకు స్థానిక యువకులు క్రీడాలు ఆడుకునేందుకు స్థలం లేక ఆటలకు దూరం అవుతున్నామని దృష్టికి తీసుకెళ్లారు. గోసాయికాలనీ వద్ద గల ప్రభుత్వ స్థలంలో తాత్కలిక మైదానం ఏర్పాటుకు ముళ్లకంపలు, పిచ్చి మొక్కలను దగ్గరుండి చదును చేయించారు. ఆయన వెంట సిద్ధార్థ, ఖాలేద్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

బషీరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడూ దృష్టి సారించాలని గ్రామ ప్రత్యేకాధికారి, బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ కార్యదర్శికి సూచించారు. శుక్రవారం మండలంలోని మంతన్‌గౌడ్‌తండా పంచాయతీని ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం కార్యదర్శితో కలిసి ఆయన పలు అంశలపై చర్చించారు. ప్రధాన సమస్యలపై ఆరా తీశారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యదర్శికి సూచించారు. వచ్చే వేసవి దృష్ట్యా తాగునీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు చేయండి


అంబేడ్కర్ చౌక్‌లో నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

తాండూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తాండూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఎస్సీ జాబితాలోని 59 కులాలకు రిజర్వేషన్ అవకాశాలు లేకుండా కాంగ్రెస్ మెజార్టీ దళిత కులాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. తాండూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శేఖర్, లాలప్ప, రాములు, తాండూరు, పెద్దేముల్ , యాలాల మండల శాఖ అధ్యక్షులు జగదీశ్వర్,అంజయ్య, నరేష్, పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మ జాతర

నవాబుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నవాబుపేట మండలం అక్నాపూర్ గ్రామంలో శుక్రవారం ఈదమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగాల మహాపడిపూజ

యాలాల, ఫిబ్రవరి 14, (ఆంధ్రజ్యోతి) : యాలాల మండల కేంద్రంలో మల్లికార్జునస్వామి జ్యోతిర్లింగాల మహాపడిపూజ ఘనంగా జరిగింది. మండల కేంద్రానికి చెందిన తోగాపురం పకిరప్ప(ప్రకాష్) స్వామి ఇంట్లో శుక్రవారం మహాపడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి దంపతులు, ఏఎంసీ డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య, సహాయ కార్యదర్శి గొల్ల చందు, గడ్డం రాములుగౌడ్, లాలు, బోయి రాజు, కట్టకడి భీమమ్మ, విష్ణు, కరాటే రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత ఇంటికి ఎంపీ ఈటల

వికారాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, దిశ కమిటీ సభ్యుడు వడ్ల నందు నివాసానికి శుక్రవారం రాత్రి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా వెళ్లారు. ఈ సందర్భంగా వడ్లనందు పని తనాన్ని మెచ్చుకున్నారు. ఉద్యమ కాలం నుంచి కష్టపడుతూ వచ్చారని బీజేపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. హైదరాబాద్‌లోని కోకాపేటలో ఉండే నందు నివాసానికి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, శామీర్‌పేట మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిట్ట పరమేశ్వర్ రెడ్డి, మోమిన్ పేట మండల మాజీ అధ్యక్షులు తదితరులు వెళ్లారు.

పొగపెట్టారు


మూసీనది వద్ద రాత్రి సమయంలో రోడ్డును కమ్మేసిన పొగ

(5వ పేజీ తరువాయి)

ఆకాశాన్ని తాకుతున్నది. రాత్రివేళల్లో పొగతీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో ఔటర్‌పై మూసీనది పక్కన కిలోమీటర్ మేర ఎటు చేసినా దట్టమైన పొగకమ్మేసింది.

టన్నుల కొద్దీ చెత్త

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవపలర్స్ లిమిటెడ్ సంస్థ రాజధాని చుట్టూ 158 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రోడ్డు భద్రతకు ఫీల్డ్ ఆఫీసర్లు ఉంటారు. వీరు ఇంత పెద్ద ఎత్తున ప్రమాదాలకు కారణమయ్యేలా రోడ్డుపై దట్టమైన పొగ కమ్ముకుంటుంటే పట్టించుకోవడం లేదు. పోచారం మున్సిపాలిటీ పరిధిలో వెలువడే టన్నుల కొద్ది చెత్తను ట్రాక్టర్లు, ఆటోల్లో తీసుకు వచ్చి ఘట్‌కేసర్‌లోని ఔటర్‌టోల్‌ప్లాజా వద్ద తగులబెడుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో ఈ చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నిర్వాహకులకు టన్నుకు రూ.1,100 చెల్లించి అప్పగించేవారు. అయితే ఆ చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు కాలుస్తున్నారని, ఎంతకూ ఆ మంటలు ఆరడం లేదని మున్సిపల్ అధికారులు చెబుతుండడం విశేషం. ఇప్పటికైనా అధికారులు గుర్తించి ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో చెత్తను కాల్చకుండా, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

వారంలో మూడు రోజులు జ్వరమే..



చెత్త డంపింగ్ చేసే పరిసరాల్లో తాటి చెట్లకు కల్లు గీస్తుంటాను. చెత్త తగలబెట్టడం వల్ల నాకు వారంలో మూడుసార్లు జ్వరం వస్తోంది. కల్లు తాగడానికి ఎవరూ రావడం లేదు. మున్సిపల్ అధికారులు చెత్తను ఈ ప్రాంతంలో డంప్ చేయకుండా చూడాలి.

వీరగోని అంజనేయులుగౌడ్, గీత కార్మికుడు, కొర్రెముల

పొలానికి వెళ్లాలంటేనే భయం వేస్తోంది..



పోచారం మున్సిపాలిటీలోని పలు గ్రామాల నుంచి సేకరించిన చెత్తను కొర్రెముల మూసీనది వద్దకు తరలించి తగులబెడుతున్నారు. దీంతో పొగ, దుర్వాసనతో రోగాలు వస్తున్నాయి. ఆ భయంతో మా పొలానికి వెళ్లాలంటేనే భయం వేస్తోంది. కాలుష్య నియంత్రణ అధికారులు వెంటనే గుర్తించి సమస్యను పరిష్కరించాలి.

- మాటూరి రవి, స్థానికుడు కొర్రెముల

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి


కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : అనేక కార్యక్రమాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు సీఎస్‌సీ విభాగం డీన్ జీ విష్ణుమూర్తి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ వర్సిటీలో శుక్రవారం జరిగిన 'గేమోర్ట్ -ఒక నైపుణ్యం సమకాలీకరణ అనే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యూనివర్సిటీలో విద్యార్థులకు అనేక కార్యక్రమాల ద్వారా నైపుణ్యం సమూపార్జనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయ్‌కుమార్, మహిపతి శ్రీనివాస్‌రావు, రామనకుమార్, శ్రీనివాస్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణ్

కీసర, జనవరి(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కీసర పోలీస్‌స్టేషన్ ఎస్.లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం చీర్యాల్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితిలోనైనా సరే తమ బ్యాంక్ అకౌంట్, ఓటీపీ వివరాలు ఎవరికీ చెప్పకూడదన్నారు. సైబర్ నేరాగాళ్ల బారినపడి మోసపోయిన వారు వెంటనే 1930కి ఫోన్ చేయాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోల కృష్ణ, మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్, శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేణు, సుమన్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

స్నేహితుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

దోమ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి అంత్యక్రియలకు గాను తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. దోమ మండలం దొంగఎన్కెపల్లికి చెందిన బాసుపల్లి చంద్రయ్య శుక్రవారం మృతిచెందిన విషయం తెలుసుకున్న పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు రూ.16వేలు కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి తన అనుచరుల ద్వారా ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో శేరి రాంరెడ్డి, సభావత్ బాబ్యా, డప్పు శ్రీనివాస్, కిన్నెర బాల్‌రాజ్, కుమ్మరి ఈశ్వరయ్య, మూడవత్ దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా వివాహ వార్షికోత్సవం

▸▸ ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి హాజరు


కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట్, ఫిబ్రవరి 14, (ఆంధ్రజ్యోతి) : నవాబుపేట మండలం పుల్‌మామిడికి చెందిన మేకువనంపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొంపల్లి మాణిక్‌రెడ్డి, రాజమణి దంపతుల 50వ వివాహ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డిలు హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆదాయపన్ను శాఖ రిటైర్డ్ అధికారి చంద్రిక, న్యాయవాదులు రాజేశ్వర్, రచనారెడ్డి, అంతర్జాతీయ పరిశోధనా సంస్థ మాజీ శాస్త్రవేత్త కొత్తపల్లి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, మాజీ ప్రధానోపాధ్యాయులు సోంరెడ్డి, వెంకట్‌రెడ్డి, నవాబుపేట మండలానికి చెందిన నాయకులు, సీనియర్ జర్నలిస్టు వెంకట్‌రెడ్డి, ఇందిరా దంపతులు, గిరిధర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సత్యశివారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అర్చనారెడ్డి, మండలంలోని వివిధ పార్టీల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ మెంబర్‌కు సన్మానం


ఎర్రవల్లి జాఫర్‌ను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వికారాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆర్టీఏ మెంబర్లతో మంత్రి , ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్ పలు అంశాలపై సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ క్రమంలో జాఫర్‌ను ప్రత్యేకంగా అభినందించి మంత్రి సన్మానించారు.

ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి జ్ఞాపిక బహూకరణ


ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న నరేందర్ రెడ్డి

కోట్‌పల్లి, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మండలంలోని బార్వాద్‌కి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు శనిగారం నరేందర్ రెడ్డి శుక్రవారం బాల రాముని విగ్రహాన్ని జ్ఞాపికగా అందజేశారు. అయోధ్య నుంచి తెచ్చిన విగ్రహం అని తెలిపారు.

ఎంపీ నిధులతో గ్రామాల అభివృద్ధి

పరిగి,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో గ్రామాలు అభివృద్ధి చేస్తున్నామని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి బి.రాంచందర్, కార్యదర్శి వేముల పెంటయ్యలు అన్నారు. మండల పరిధిలోని ఇబ్రహీంపూర్‌లో శుక్రవారం ఎంపీ నిధులతో కొత్తగా బోరు వేసి, మోటారు బిగించి ప్రారంభించారు. గ్రామాల్లోని సమస్యలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ప్యానల్ బోర్డు రెండో రోజు శిక్షణను ఎంఈవో హరిలాల్ శుక్రవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభించారు. చౌదర్‌పల్లి, రేగడిమైలారం పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ వారు ఉన్నత పాఠశాల్లో 8, 9, 10వ తరగతులకు అన్ని సబ్జెక్టుల పాఠాలు పొందుపర్చినట్లు తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్వామివివేకానంద పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. డీఈవోగా విజయ్, ఎంఈవోగా శ్రీనివాస్, హెచ్ఎంగా స్వస్తిక, పీఈటీగా ఆనంద్, నవీన్, నందిని, శ్రీలత, మనీషాతో పాటు 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నర్సింహులు, హెచ్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు నిరోషా, శ్రీనివాస్, శ్యామల, విజయలక్ష్మి, లక్ష్మీ, శ్రీదేవి, భాగ్య, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి అండగా పీఆర్టీయూటీఎస్

బషీరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని బెదిరింపులకు గురి చేయడం తగదని పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దర్పీడి వెంకట్రామ్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు కె.నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎక్మాయి(హరిజనవాడ) పాఠశాలను భోజన విరామ సమయంలో సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలితో చర్చించి మనోధైర్యం ఇచ్చారు.

క్రైం కార్నర్

ఆడుకుంటూ.. అనంతలోకాలకు

▸▸ కిటికీ మీద పడి చిన్నారి మృతి ▸▸ పరిగిలో విషాదం


మృతిచెందిన సోనీ

పరిగి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న ఇంటి కిటికీ మీద పడి నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ విషాదకర ఘటన వికారాబాద్ జిల్లాలో జరిగింది. దోమ మండలం బ్రాహ్మణపల్లితండాకు చెందిన హన్మంత్‌నాయక్- చాందీబాయి దంపతులు కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగేళ్ల కూతురు సోనీని తీసుకుని వారిద్దరూ పని కోసం శుక్రవారం పరిగికి వచ్చారు. హన్మంత్‌తుంకులగడ్డకు వెళ్లగా, చాందీబాయి కూతుర్ని తీసుకుని వెంకటేశ్వరకాలనీలో ఓ ఇంటినిర్మాణ పనికి కూలీగా వెళ్లింది. పాపను ఓ చోట పడుకోబెట్టి పనిలో నిమగ్నమైంది. చిన్నారి ఆడుకుంటూ ఇంటి గోడకు పెట్టిన కిటికీని పట్టుకుంది. దాంతో ఆ కిటికీ ఒక్కసారిగా పాప తలపై పడడంతో తీవ్ర గాయాలపాలైంది. వెంటనే పాపను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందిందని ధ్రువీకరించారు. కళ్ల ముందే కూతురు ప్రాణాలు పోవడం చూసిన చాందీబాయి కన్నీరుమున్నీరుగా విలపించింది. హన్మంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గార్డెనింగ్ వర్క్ చేస్తుండగా..

కారు ఢీకొని కార్మికుడి మృతి

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : అతివేగంగా కారుతో వచ్చి ఢీకొట్టగా వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఉదంతం శామీర్‌పేట పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. .. కీసరకు చెందిన మాసపాక పరుశురాములు(39) ఓఆర్ఆర్ గార్డెనింగ్ వర్క్ చేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం శామీర్‌పేట సమీపంలో ఓఆర్ఆర్ 66వ కిలోమీటర్ వద్ద అతనితో పాటు మరో ముగ్గురు గార్డెనింగ్ పనిచేస్తున్నారు. కీసర వైపు నుంచి వేగంగా వచ్చిన కారు పరుశురాములును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తోటి వర్కర్లు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు నడిపిన మహారాష్ట్ర షోలాపూర్‌కు చెందిన అశుతోష్ విశ్వాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బిమ్మికి చెందిన మర్రి అంకిత(21) డిగ్రీ రెండవ సంవత్సరం వరకు చదివింది. పోచారం మున్సిపాలిటీ జోడిమెట్ల హుండా కార్తికేయ కాలనీలోని వసతి గృహంలో ఉంటూ ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో కొనసాగుతున్న ఉచిత కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటుంది. శుక్రవారం కడుపు నొప్పి వస్తుందని శిక్షణకు వెళ్లకుండా వసతిగృహంలోనే ఉంది. కానీ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం చేయలేదు. దీంతో కడుపు నొప్పి అధికమై భరించలేక గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. అనంతరం అంకిత తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం


రాజేష్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : బీటెక్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం కేంద్రానికి చెందిన దొమ్మాట సంజీవులు పెద్ద కుమారుడు దొమ్మాట రాజేష్ (20) ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. అవుషాపూర్‌లోని అరోరా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 12న తన తమ్ముడితో మాట్లాడి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి సెల్‌కు కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు.. రాజేష్ మిత్రులైన దనుష్, వేణులను విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కులకచర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన కలకచర్ల మండలం రాంరెడ్డిపల్లిలో శుక్రవారం తెల్లవారుజాము జరిగింది. గ్రామానికి చెందిన కుమ్మరి ముత్యాలమ్మ ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మురళీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నర్సింహులు కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సహాయంగా 10 కిలోల బియ్యం అందించారు.

'దగా'ఖానాలు

(5వ పేజీ తరువాయి)

కమీషన్ మాట్లాడుకుని అక్కడ పరీక్షలు చేయించుకోవాలని అజమాయిషీ చేస్తున్నారని పలువురు వైద్యానికి వచ్చిన వారు చెబుతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో వీధి వీధికి ఒక డయాగ్నస్టిక్ సెంటర్ వెలిసింది. చాలా ఆసుపత్రుల్లో అనుమతులు లేకుండానే నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బిల్లులు ఇవ్వని ఓ ఆసుపత్రి

పట్టణంలో ఏళ్లగా నడుస్తున్న ఓ ఆసుపత్రి అయితే ఇప్పటికీ బిల్లులు ఇవ్వడం లేదు. ఓ పేపర్‌పై చిట్టీ రాసి వేలల్లో బిల్లు అయిందని వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో డ్రగ్ మాఫియా రాజ్యమేలుతోంది. ఫార్మా అసోసియేషన్ పెద్దల కనుసన్నల్లో మెడికల్ షాపులు నడుస్తున్నాయి. వారు పంపించిన మందులే వాడలని భయ పెడుతున్నారు. ఎవరైనా మెడికల్ నిర్వాహకులు వినకపోతే వారిపై ఉన్నతాధికారులతో దాడులు చేయించడం, చిన్నచితక దానికి కూడా పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తుండడంతో మెడికల్ వ్యాపారుల అసోసియేషన్ నాయకుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. మెడికల్ షాపుల్లో వసూలు కోసం ఓ అధికారి తన కారు డ్రైవర్‌ను వసూళ్ల కోసం వాడుతున్నాడు. ముందుగా కార్యాలయంలో పనివాడిగా చేరిన ఆ వ్యక్తి తర్వాత డ్రైవర్‌గా మారాడు. ఆ సార్‌కు తానే అన్ని అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సార్ చెప్పే కమీషన్‌తోపాటు తను సైతం మెడికల్ షాపుల వద్ద ఎక్కువమొత్తంలో వసూలు చేస్తున్నట్లు సమాచారం. తనకు ఎప్పుడు అడిగితే అప్పుడు డబ్బులు ఇవ్వాలని జులుం చేస్తున్నాడని పలువురు వాపోతున్నారు.

▸▸ సాంకేతిక అంశాల పై అవగాహన

ధారూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కింద, నాగసమందర్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 16 సాంకేతిక అంశాల పై అవగాహన కల్పించారు. కలాం స్ఫూర్తి యాత్ర, ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ వారి ఆధ్వర్యంలో ఆగుమెంటెడ్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్స్ ప్రోగ్రాం తయారీ, ఆదేశాలు ఇచ్చే విధానం తదితర అంశాల గురించి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

▸▸ కొవ్వొత్తులతో నివాళి


కొవ్వొత్తులతో బీజేపీ నేతలు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా సంఘటన జరిగి ఏడాది గడుస్తున్న రీత్యా శుక్రవారం అశువులు బాసిన అమరులకు నివాళులు అర్పించారు. ఆ మేరకు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు కొవ్వొతులతో ప్రదర్శన చేశారు. పార్టీ నాయకులు జగదీశ్వర్, జగ్గు, డప్పు జనార్దన్, బాబాయ్యనాయుడు, శ్రీనివాస్‌సాగర్ పాల్గొన్నారు.